AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in

## అంతర్ జిల్లా దొంగల అరెస్ట్



2



2

## ప్రమాదాల నివారణకు చెక్..!

## జిల్లాస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలు



**అక్షరటుడే, ఇందూరు:** రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 14, 15వ తేదీలో జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మీసాల శ్రీనివాస్, రామచంద్ర తెలిపారు. ఎంపికలు సుభాష్‌నగర్‌లోని డీవైఎస్‌వో స్కేటింగ్ రింగులో ఉంటాయన్నారు. 4 ఏళ్ల నుంచి 18 ఏళ్ల లోపు కేటగిరీల వారీగా స్పీడ్ క్వాడ్, ఇన్‌లైన్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలకు రాంచందర్ 9182339154కు సంప్రదించాలన్నారు.





# అడుగుకో గుంత.. తీరని చింత..

జిల్లాలో కొద్దిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పలు చోట్ల రోడ్లు దెబ్బతిన్నాయి. నగర శివారులోని మాధవనగర్ వద్ద ఆర్ అండ్‌బీ రోడ్డు ప్రమాదకరంగా మారింది. భారీగా గుంతలు ఏర్పడడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. కారు పలు భాగాలు రోడ్డును తాకి దెబ్బతింటున్నాయి. దీంతో సాయిబాబా ఆలయం వద్ద ఓవైపు రోడ్డుపై రాకపోకలను శనివారం ఉదయం నుంచి మూసివేశారు. రోడ్డుపై సూచికలు ఏర్పాటు చేశారు. ఈ రోడ్డును వెంటనే బాగు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. –అక్షరటుడే, డిచ్‌పల్లి



## కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

**అక్షరటుడే, ఎల్లారెడ్డి :** నిజాంసాగర్ ప్రాజెక్ట్‌కు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. దీంతో అధికారులు గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయంలోకి ప్రస్తుతం 14,170 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ఎగువన సింగూరు, పోచారం ప్రాజెక్ట్‌ల నుంచి నిజాంసాగర్‌కు వరద వస్తోంది. దీంతో అధికారులు రెండు గేట్లు ఎత్తి 13,564 క్యూసెక్కులు మంజీర లోకి వదులుతున్నారు. నిజాంసాగర్ ప్రధాన కాలువకు వెయ్యి క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1405 (17.8 టీఎంసీలు) అడుగులు కాగా.. ప్రస్తుతం 1404.7 (17.44 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉంది. నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం ప్రాజెక్ట్‌కు వరద కొనసాగుతోంది. ప్రాజెక్ట్‌కు 3,230 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా ప్రాజెక్ట్‌పై నుంచి పొంగిపొర్లుతోంది.



## రాజీయే రాజమార్గం..

**అక్షరటుడే, ఎల్లారెడ్డి :** కక్షిదారులకు రాజీమార్గమే రాజమార్గమని ఎల్లారెడ్డి మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి సుష్మ అన్నారు. సెప్టెంబర్ 13న నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో 480 కేసులు పరిష్కరించినట్లు పేర్కొన్నారు. రాజీపడడానికి అవకాశం ఉన్న అన్ని కేసుల్లో కక్షిదారులు రాజీపడవచ్చని ఆమె సూచించారు. క్షణికావేశంలో జరిగిన తప్పులను సరిదిద్దుకోవడానికి ఇదే సరైన అవకాశం అని ఆమె ఈ సందర్భంగా పేర్కొన్నారు. అనవసర గొడవలు, పట్టింపులకు పోయి జీవితాలను ఇబ్బందుల పాలు చేసుకోవద్దని సూచించారు. మూడు సివిల్ తగాదాలు, 47 క్రిమినల్ కేసులు, 12 అబ్కారీ కేసులు (రూ.60,000), 14 క్రిమినల్ నేరం ఒప్పుకున్నవి (రూ.53,500), ఒక చెక్ బౌన్స్ కేసు, రెండు భత్యం కేసులు, 341 పీటీ కేసులు, 18 బ్యాంకు తగాదాలు, మూడు సైబర్ నేరాలు పరిష్కారమయ్యాయని వివరించారు.



యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తెల్లారగానే సొసైటీల వద్దకు పరుగులు తీస్తున్నారు. రోజుల తరబడి ఎరువుల బస్తాల కోసం పడిగాపులు కాస్తున్నారు. అన్ని పనులు మానుకొని యూరియా కోసం తిరుగుతున్నారు. అయినా యూరియా కొరత ఉండడంతో రైతులకు సరిపడా బస్తాలు లభించడం లేదు. దీంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

– అక్షరటుడే, కామారెడ్డి

# యూరియా.. ఏదయా!

▸ తీవ్ర ఇబ్బందులు పడుతున్న రైతులు ▸ బస్తాల కోసం సొసైటీల వద్ద బారులు ▸ రోజుల తరబడి నిరీక్షించినా దొరకని ఎరువులు ▸ బీబీపేటలో ఠాణాలో యూరియా టోకెన్ల పంపిణీ

జిల్లాలో యూరియా కొరత తీవ్ర మరింత తీవ్రమైంది. సరిపడా స్టాక్ రాకపోవడంతో రైతాంగం తీవ్ర ఆందోళన చెందుతోంది. వరి పంటకు రైతులు మూడు దఫాలుగా యూరియా వేస్తారు. రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో ప్రస్తుతం వేర్వేరు దశల్లో వరి పైరు ఉంది. కొన్ని చోట్ల రెండో దఫా, మరికొన్ని చోట్ల చివరి దశ యూరియా చల్లాల్సి ఉంది. ముందుగా వరిసాగు చేసిన ప్రాంతాల్లో ప్రస్తుతం పైర్లు పొట్ట దశలో ఉన్నాయి. ఇప్పుడు యూరియా వేయకపోతే దిగుబడిపై ప్రభావం చూపుతుంది. సమయం మించిపోతుండడం, యూరియా దొరకక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

### సరిపడా లేని సరఫరా

సరఫరాలో అంతరాయంతోనే యూరియా కొరత ఏర్పడిందని ప్రభుత్వం చెబుతోంది. రాష్ట్రానికి రావాల్సిన కోటాలో సగం కూడా రాలేదని, కేంద్ర ప్రభుత్వాన్ని ఎన్నిసార్లు అడుగుతున్నా పంపించడం లేదని పేర్కొంటోంది. బఫర్ స్టాక్‌తో రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నామని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. అయితే యూరియా లేక రైతులు మాత్రం నిత్యం సొసైటీల వద్దకు వచ్చి ఆరా తీస్తున్నారు. పలానా కేంద్రానికి ఎరువులు వచ్చాయని తెలియగానే భారీ సంఖ్యలో అక్కడకు చేరుకుంటున్నారు. తాజాగా బీబీపేట మండల



కేంద్రంలో రైతులు భారీగా రావడంతో సొసైటీ సిబ్బంది చేతులేత్తేశారు. దీంతో పోలీసులు వచ్చి టోకెన్లు పంపిణీ చేసి బస్తాలు అందించారు.

### 600 బస్తాలు.. వెయ్యి మంది రైతులు

జిల్లాలోని బీబీపేట సొసైటీకి యూరియా వచ్చిందనే సమాచారంతో శుక్రవారం అర్ధరాత్రి నుంచే రైతులు పడిగాపులు కాశారు. శనివారం ఉదయం సిబ్బంది వచ్చి టోకెన్లు పంపిణీ చేద్దాం అనుకున్నారు. అయితే సొసైటీకి 600 బస్తాల యూరియా మాత్రమే వచ్చింది. కానీ దాదాపు వెయ్యి మంది రైతులు లైన్‌లో ఉన్నారు. ఈ క్రమంలో సొసైటీ సిబ్బందికి, రైతులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసులు వచ్చి సముదాయించినా రైతులు వినిపించుకోలేదు. ఈ క్రమంలో యూరియా పంపిణీ తమతో కాదని సొసైటీ సిబ్బంది చేతులేత్తేశారు.

### పోలీస్ స్టేషన్‌లో టోకెన్లు..

సొసైటీ సిబ్బంది చేతులు ఎత్తేయడంతో పోలీసులే టోకెన్లు పంపిణీ చేశారు. ఈ క్రమంలో పోలీసులతో పలువురు రైతులు వాగ్వాదం చేశారు. దీంతో పోలీసులు ఠాణాకు వచ్చి టోకెన్లు తీసుకోవాలని రైతులకు సూచించారు. దీంతో అన్నదాతలు మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎండలో కూర్చున్నారు. అనంతరం వారికి పోలీసులు టోకెన్లు అందజేశారు.

### సొమ్మసిల్లి పడిపోయిన రైతు

యూరియా కోసం ఎండలో కూర్చున్న ఓ రైతు సొమ్మసిల్లి పడిపోయాడు. దీంతో ఆయనను స్థానిక ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ఎరువుల కోసం గతంలో ఎప్పుడూ కూడా పోలీస్ స్టేషన్‌కు రాలేదన్నారు. ఇప్పటికైనా సీఎం రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి జోక్యం చేసుకొని రైతులందరికీ సరిపడా యూరియా పంపిణీ చేయాలని కోరారు.

## తెలంగాణ తిరుమలలో ఎమ్మెల్యే పోచారం పూజలు



**అక్షరటుడే, బాన్సువాడ:** బీర్కూర్ మండలం తిమ్మాపూర్ తెలంగాణ తిరుమల తిరుపతి దేవస్థానాన్ని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా వేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బోధన్ మండలం ఆచన్‌పల్లికి చెందిన కామేపల్లి ప్రశాంత్, ప్రవళిక దంపతులు ఆలయానికి రూ.1,11,111 విరాళాన్ని ఆలయ ధర్మకర్త పోచారం శ్రీనివాస్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ ఛైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, శంభురెడ్డి, బీర్కూర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ శ్రీమతి దుర్గం శ్యామల, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ సమస్యలను పరిష్కరించాలి



**అక్షరటుడే, బాన్సువాడ :** బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ ముఖ్య నాయకులు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్‌ను శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధి, రైతు సమస్యలు, పలు స్థానిక అంశాలపై చర్చించినట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి, మంత్రి గణేష్, కొత్తకొండ భాస్కర్, అంబర్ సింగ్, నందు పటేల్ తదితరులు పాల్గొన్నారు.




## ఇందూరు నుంచి వందే భారత్ నడిపేందుకు కృషి చూస్తా: ఎంపీ అర్వింద్

**అక్షరటుడే, ఇందూరు:** నిజామాబాద్ నుంచి వందే భారత్ రైలు నడిచేలా తన వంతు కృషి చేస్తానని ఎంపీ ధర్మపురి అర్వింద్ తెలిపారు. నిజామాబాద్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన మాట్లాడారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ సమస్యలపై వినతి పత్రం అందించిందని వాటిని పరిష్కరించేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఇప్పటికే పలు రైళ్లు జిల్లా నుంచి ముంబైకి, ఇతర ప్రాంతాలకు వెళ్తున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన జీఎస్టీ వ్యాపారస్థులకు ఊరట కల్పించిందన్నారు. ఇకపై వ్యాపారం జోరుగా సాగే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీని అభినందించారు. అనంతరం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ.. తనను అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు సంతోషంగా ఉందన్నారు. జిల్లాలో 30 ఏళ్లుగా సేవలందిస్తున్న కమిటీకి సారథ్యం వహించడం అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. తన హయాంలో నూతన భవనం నిర్మిస్తామన్నారు. నూతన కమిటీతో రాష్ట్ర ప్రతినిధి రాచకొండ రవికుమార్ ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో నుడా ఛైర్మన్ కేశ వేణు, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రావు, హరి ప్రసాద్, జితేంద్ర మలాని తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సారెస్పీని సందర్శించిన హైకోర్టు జడ్జిలు

**అక్షరటుడే, ఇందూరు:** నిజామాబాద్ జిల్లాలోని మెండోరా మండలం పోచంపాడ్‌లో ఉన్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టును రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు సందర్శించారు. జస్టిస్ పి సామ్ కోషి, జస్టిస్ సృజనతో కూడిన బృందం శనివారం ప్రాజెక్టును పరిశీలించింది. నిర్మల్ జిల్లాలో పర్యటన ముగించుకుని తిరుగు ప్రయాణంలో ఎస్సారెస్పీని సందర్శించిన హైకోర్టు న్యాయమూర్తులను నిజామాబాద్ జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టును సందర్శించిన అనంతరం, హైకోర్టు జడ్జిలు కలెక్టర్‌తో భేటీ అయ్యారు. ప్రాజెక్టు గురించి, జిల్లాలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు.



## అలరించిన హీరోయిన్ ఐశ్వర్య

"హలో నిజామాబాద్ పీపుల్.. ఎలా ఉన్నారు".. అంటూ సంక్రాంతి సినిమా హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ ఇందూరులో సందడి చేశారు. హైదరాబాద్ రోడ్‌లోని గోయజ్ సిల్వర్ జువెలరీ షోరూం ప్రారంభోత్సవానికి ప్రముఖ నిర్మాత దిల్ రాజు కూతురు హన్షిత రెడ్డితో కలిసి హాజరయ్యారు. అభిమానుల కోరిక మేరకు నృత్యం చేసి ఆకట్టుకున్నారు. దేశంలోనే లార్జెస్ట్ సిల్వర్ జ్యువెలరీ షోరూమ్ గోయాజ్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ప్రధాన నగరాలతో నిజామాబాద్ పోటీ పడుతోందని ఐశ్వర్య పేర్కొన్నారు.

- అక్షరటుడే, ఇందూరు





## అవయవ దానం చేసిన కుటుంబానికి పరామర్శ

**అక్షరటుడే, డిచ్‌పల్లి:** మండలంలోని ధర్మారం(బి) గ్రామానికి చెందిన బుర్ర రాజేష్ గౌడ్ ఇటీవల అధిక రక్తపోటుతో బ్రెయిన్ డెడ్ అయి మరణించాడు. దీంతో ఆయన అవయవదానానికి కుటుంబ సభ్యులు ముందుకొచ్చారు. రాజేష్ గౌడ్ కాలేయం, రెండు కంటి కార్నియాలను ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఓ రోగికి దానం చేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే భూపతి రెడ్డి ధర్మారం(బి)లో బుర్ర రాజేష్ కుటుంబ సభ్యులను శనివారం పరామర్శించారు. ఆయన వెంట నాయకులు వాసు బాబు, ధర్మాగౌడ్ ఉన్నారు.



## సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం

**అక్షరటుడే, దోంగ్లి:** మండలంలోని మోగా పంచాయతీ ఆవరణలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు, సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు గజ్జు దేశాయి మాట్లాడుతూ గతేడాది ఎన్నికల ప్రచారంలో భాగంగా లక్ష్మీకాంతారావు పర్యటించి గ్రామానికి రోడ్డు, వంతెనలు మంజూ రు వేయిస్తానని హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం.. రూ.50లక్షలతో వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారన్నారు. అలాగే మోగా నుంచి మద్నూర్‌కు వంతెన కోసం రూ.30 లక్షల నిధులు మంజూరు చేశారని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ పరమేష్ పటేల్, మాజీ విండో చైర్మన్ శివాజీ, మాజీ ఎంపీటీసీ దీన్ దయాల్, నాయకు లు పురుషోత్తం పటేల్, శివారెడ్డి, దుంపల్ వార్ శంకర్ పాల్గొన్నారు.

## ధర్మారం (బి) శివారులో వాహనాల తనిఖీ



**అక్షరటుడే, డిచ్‌పల్లి :** మండలంలోని ధర్మారం శివారులో నిజామాబాద్ – డిచ్‌పల్లి ప్రధాన రహదారి అమృత గార్డెన్ ఎదుట ట్రాఫిక్ పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ట్రాఫిక్ సీఐ వినోద్ ఆధ్వర్యంలో నిబంధనలు పాటించని వాహనదారులకు పలు సూచనలు చేశారు. కొందరు వాహనదారుల కారు అద్దాలకు అతికించిన బ్లాక్ స్టిక్కర్లను తొలగించారు. తనిఖీల్లో ట్రాఫిక్ ఎస్సైలు వంశీకృష్ణ, చంద్రశేఖర్, ట్రాఫిక్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.



## ఆటోల చోరీ కేసులో అంతర్ జిల్లా దొంగల అరెస్ట్

**అక్షరటుడే, కామారెడ్డి:** ఆటోల చోరీకి పాల్పడిన కేసులో ఇద్దరు అంతర్ జిల్లా దొంగలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం మీడియాకు వివరాలు వెల్లడించారు. నాగిరెడ్డిపేట మండలం గోపాల్‌పేటలో ఈనెల 11న అర్ధరాత్రి గ్రామానికి చెందిన తాడేపల్లి కృష్ణకు సంబంధించిన బజాజ్ ప్యాసింజర్ ఆటోను దుండగులు ఎత్తుకెళ్లారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మాల్తుమ్మెద శివారులో శనివారం పోలీసులు వాహనాలను తనిఖీలు చేస్తుండగా పోలీసులను చూసి పారిపోతున్న ఇద్దరిని పట్టుకుని విచారించారు. పోలీసుల విచారణలో నాగిరెడ్డిపేట మండలంలో చోరీ చేసిన ఆటో, మెదక్ జిల్లాలో చోరీ చేసిన రెండు ఆటోలు, భిక్కనూరులో చోరీ చేసిన ఆటో మొత్తం నాలుగింటిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులు మోపాల్ మండలం మంచిప్పకు చెందిన కనుగుల రాజు, గూపన్‌పల్లికి చెందిన కొల్ల దుర్గారాజులను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుంచి రూ. 2.45 లక్షల విలువ చేసే నాలుగు ఆటోలను, 2 మొబైళ్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ తెలిపారు. కేసును త్వరితగతిన ఛేదించిన నాగిరెడ్డిపేట పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

తెలంగాణ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఆర్టీసీ) ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టింది. ఒకవైపు ఆదాయాన్ని పెంచుకుంటూనే.. మరోవైపు ప్రయాణికుల మన్ననలు పొందేందుకు ప్రయోగాలను చేపడుతోంది. ఇందులో భాగంగా డ్రైవర్లు డ్యూటీలో ఉన్న సమయంలో ఫోన్‌ను డిపోలోనే డిపాజిట్ చేసేలా సరికొత్త విధానాన్ని ప్రవేశపెట్టింది. ఈ విధానంపై ఫలితాలను సమీక్షించనుంది.

– అక్షరటుడే, ఇందూరు




# ప్రమాదాల నివారణకు చెక్..!

▸ ఆర్టీసీ డ్రైవర్లు ఫోన్లు మాట్లాడకుండా చర్యలు ▸ ఇకపై డిపోలో డిపాజిట్ చేయాల్సిందే ▸ కామారెడ్డిలో ప్రయోగాత్మకంగా అమలు

ఆర్టీసీకి రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 11 రీజియన్లు ఉన్నాయి. కాగా.. కాగా ప్రమాదాల నివారణకు డ్రైవర్లు ఫోన్లను డిపోలో డిపాజిట్ చేసేలా చర్యలు తీసుకుంది. ఇందులో ప్రతి రీజియన్ నుంచి ఒక డిపోను ప్రయోగాత్మకంగా ఎంపిక చేసింది. నిజామాబాద్ రీజియన్ పరిధిలో మొత్తం 6 డిపోలు ఉన్నాయి. ఇందులో 900 మంది డ్రైవర్లు, ఎలక్ట్రిక్ బస్సులు నడిపే ఔట్‌సోర్సింగ్ డ్రైవర్లు ఉన్నారు. అయితే నిజామాబాద్ రీజియన్ పరిధిలో కామారెడ్డి డిపోను ఎంపిక చేసి ఫోన్ల వాడకాన్ని నిషేధించింది. ఈ విధానాన్ని ఒక నెలపాటు అమలు చేసి సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నారు. ఈ మేరకు డిపోలోని డ్రైవర్లు ఫోన్ లేకుండానే బస్సులో విధులు నిర్వహిస్తున్నారు. విధులకు వెళ్లే ముందు డిపో సెక్యూరిటీకి తమ ఫోన్‌ను అందజేస్తున్నారు.

గత నెలలో డిపోల వారీగా డ్రైవర్లకు మూడు రోజులపాటు ప్రత్యేక శిక్షణ ఇచ్చి పలు సూచనలు చేశారు. ఆర్టీసీ అధికారులే కాకుండా ఆర్టీఏ, ట్రాఫిక్ పోలీసు అధికారులతో సైతం రోడ్డు భద్రత నియమాలు, డ్రైవింగ్ చేసే సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

### బస్సు ఎక్కేముందు పరీక్షలు..

ఆర్టీసీ సిబ్బందికి ఎలాంటి ప్రమాదాలు చేయని డ్రైవర్లతో సలహాలు, సూచనలు ఇప్పించారు. విధుల్లో చేరేముందు మద్యం తాగారా లేదా అనేది డిపోలో నిత్యం పర్యవేక్షిస్తున్నారు. అయితే పలువురు డ్రైవర్లు విధుల్లో చరవాణి వినియోగిస్తున్నట్లు ప్రయాణికుల నుంచి ఫిర్యాదులు అందిన నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే ప్రయోగాత్మకంగా కొన్ని డిపోలను ఎంచుకున్నారు. ఇక్కడ విజయవంతమైతే క్రమంగా అన్ని డిపోల్లో ఈ విధానం అమలు చేయనున్నట్లు సమాచారం.

### సురక్షితమైన ప్రయాణమే లక్ష్యం..



ప్రయాణికుల సురక్షితమైన ప్రయాణమే లక్ష్యంగా ప్రయోగాత్మకంగా నిర్ణయం తీసుకున్నాం. నిజామాబాద్ రీజియన్ పరిధిలో కామారెడ్డిని ఎంపికైంది. ప్రస్తుతం ఫోన్ లేకుండానే కామారెడ్డి డిపో డ్రైవర్లు విధులు నిర్వహిస్తున్నారు. ఇతర డిపోల్లోనూ డ్రైవర్లకు మౌఖిక ఆదేశాలు జారీ చేశాం.

– జ్యోత్స్న, రీజినల్ మేనేజర్, నిజామాబాద్

## బాధిత కుటుంబాలకు పరామర్శ



**అక్షరటుడే, ఆర్మూర్:** ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి సహాయకుడు శంకర్ తండ్రి ఇటీవల మృతి చెందాడు. దీంతో శంకర్ ఇంటికి ఎమ్మెల్యే వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే ఆర్మూర్ పట్టణంలోని గుడ్ల బాబా ఇటీవల చనిపోవడంతో వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. అదేవిధంగా ఫతేపూర్, మంథని, ఆలూరు మిర్ధపల్లి, అమ్రాద్, మదన్ పల్లి గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను పరామర్శించి వారికి అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఆయన వెంట కలిగోట్ గంగాధర్, చింత ప్రవీణ్, మామిడి పల్లి రాజేందర్ రెడ్డి, మామిడిపల్లి చిన్నారెడ్డి ఉన్నారు.

## మానవ కర్తవ్యాలను ఆచరించాలి



**అక్షరటుడే, ఇందూరు:** మానవ హక్కులతో పాటు మానవ కర్తవ్యాలను గుర్తించి ఆచరించాలని జేసీఐ పూర్వ అధ్యక్షులు చంద్రశేఖర్, యాదేశ్ అన్నారు. అంతర్జాతీయ మానవ కర్తవ్యం దినోత్సవాన్ని పురస్కరించుకొని జేసీఐ వారోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు నగరంలోని వీఎన్‌ఆర్ పాఠశాలలో వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు.





# తాగునీరు కలుషితమైనా పట్టించుకోరా..?

**అక్షరటుడే, కోటగిరి:** పైప్‌లైన్ల లీకేజీల కారణంగా తాగునీరు కలుషితమవుతున్నా అధికారులు పట్టించుకోవట్లేదని పోతంగల్ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం సీజనల్ వ్యాధులు ప్రబలే సమయంలో అధికారులు ఇలా నిర్లక్ష్యం చేయడం తగదని వారు ఆరోపిస్తున్నారు. పోతంగల్ మండలంలోని పలు కాలనీల్లో తాగునీటి పైప్‌లైన్లు పగిలిపోయాయి. దీంతో తాగునీళ్లు పూర్తిగా కలుషితం అవుతున్నాయి. అలాగే వాటర్ ట్యాంకులను సైతం నెలల తరబడి శుభ్రం చేయకపోవడంతో అవి పూర్తిగా మురికిపట్టి పోతున్నాయి. కొన్నిరోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా కాలనీల్లో పరిస్థితులు అధ్వానంగా మారాయని వారు ఆగ్రహిస్తున్నారు.

### బ్లీచింగ్ పౌడర్ కూడా వేయట్లేదు..

నీటి ట్యాంకుల్లో కనీసం బ్లీచింగ్ పౌడర్‌కూడా వేయకపోవడంతో నీరు మురికినీటినే తాగాల్సి వస్తోందని వారు పేర్కొన్నారు. లీకేజీ అయిన నీళ్లల్లో దోమలు నిలువ ఉంటున్నాయని.. దోమల మందు పిచికారీ చేయాలని వారు ప్రజలు కోరుతున్నారు. డెంగీ, మలేరియా సోకే అవకాశాలున్నాయని.. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి వాటర్ ట్యాంకులను శుభ్రం చేయించాలని.. అలాగే పగిలిన పైప్‌లైన్లకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.



## 108 అంబులెన్స్ తనిఖీ

**అక్షరటుడే, కామారెడ్డి:** మాచారెడ్డి మండల కేంద్రంలో 108 వాహనాన్ని కామారెడ్డి జిల్లా జిల్లా మేనేజర్ తిరుపతి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంబులెన్స్‌లో పరికరాలను పరిశీలించారు. అంబులెన్స్ ఉద్యోగుల సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో అంబులెన్స్ ఉద్యోగులు ఈఎంటీ మెతుకు నరేశ్, పైలట్ మహేష్ పాల్గొన్నారు.



## ఇందల్వాయిలో రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు

**అక్షరటుడే, ఇందల్వాయి:** మండలకేంద్రంలో సీపీఐ ఆధ్వర్యంలో శనివారం తెలంగాణ రైతాంగ సాయుధ వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర నాయకుడు కంజర భూమయ్య మాట్లాడుతూ.. నాడు దొరలు, భూస్వాముల దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా, నిజాంపాలన నుంచి విముక్తి కోసం తెలంగాణ సాయుధ రైతాంగ తిరుగుబాటు మొదలైందన్నారు. దీంతో తోక ముడిచిన నైజాం సర్కారు భారత యూనియన్‌లో విలీనం చేసిందన్నారు. అందుకోసమే ఏటా సెప్టెంబర్ 17ను రైతాంగ తిరుగుబాటు దినంగా గుర్తించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, సీపీఐ జిల్లా నాయకుడు సాయగౌడ్, యువజన సంఘం నాయకుడు ఎండి హుస్సేన్, మండల నాయకులు రాంబాబు, సాయిలు, సెమినా, మీనా, లక్ష్మి రాజన్న, తదితరులు పాల్గొన్నారు.



## పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ చెక్కు అందజేత

**అక్షరటుడే, బాన్సువాడ:** నస్రుల్లాబాద్ మండలం మిర్జాపూర్‌కు చెందిన హన్మాండ్లు పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ చేయించుకోగా ఇటీవల మరణించాడు. ఆయన భార్య జయశ్రీ నామినీగా ఉండడంతో రూ.5,26,000 క్లెయిమ్ చెక్కును గ్రామస్థుల సమక్షంలో పోస్టల్ శాఖ అధికారులు అందజేశారు. ఈ సందర్భంగా బోధన్ పోస్టల్ సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ జాదవ్ ప్రకాష్ మాట్లాడుతూ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ ద్వారా ప్రమాద బీమా, ఆరోగ్య బీమా వంటి అనేక ప్రయోజనాలు ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో గంగాధర్, సోమయ్యచారి, జంగిలి శీను, సబ్ పోస్ట్‌మాస్టర్ గంగాధర్, రూపేష్ తదితరులు పాల్గొన్నారు.

## అదుపు తప్పి డ్రెయినేజీలోకి దూసుకెళ్లిన కారు



**అక్షరటుడే, డిచ్‌పల్లి :** ఓ కారు అదుపు తప్పి డ్రెయినేజీలోకి దూసుకెళ్లింది. ఈ ఘటన నగర శివారులోని మాధవ నగర్ సాయిబాబా ఆలయం వద్ద చోటు చేసుకుంది. సాయిబాబా ఆలయం వద్ద ఆర్వోబీ పనులు జరుగుతున్న విషయం తెలిసిందే. దీంతో రోడ్డు గుంతలమయంగా మారింది. ఈ క్రమంలో శనివారం ఉదయం ఓ కారు అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న డ్రెయినేజీలో పడిపోయింది. ఎయిర్ బ్యాగ్స్ ఓపెన్ కావడంతో కారులోని వ్యక్తికి ఎలాంటి గాయాలు కాలేదు. కాగా.. ఆర్వోబీ వద్ద రోడ్డు అధ్వానంగా మారడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షానికి రోడ్డు బురదమయంగా మారి పలువురు ద్విచక్ర వాహనదారులు సైతం జారి పడుతున్నారు.

## జీజీహెచ్‌లో మృతశిశువు జననం

**అక్షరటుడే, కామారెడ్డి:** పట్టణంలోని జిల్లా జనరల్ ఆస్పత్రిలో మృతశిశువు జన్మించడం కలకలం రేపింది. దీనికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ బాధితులు వాగ్వాదానికి దిగారు. వివరాల్లోకి వెళ్తే.. తాడ్వాయి మండలం బ్రహ్మాజీవాడి గ్రామానికి చెందిన అఖిలకు శుక్రవారం అర్ధరాత్రి పురిటినొప్పులు ఎక్కువ కావడంతో కుటుంబ సభ్యులు ఆమెను జీజీహెచ్‌కు తీసుకొచ్చారు. మొదటి కాన్పు కావడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. నొప్పులు భరించలేకపోతుందని ఆపరేషన్ చేయాలని తాము వేడుకున్నామని.. అయినప్పటికీ మొదటి కాన్పు కావడంతో వైద్యులు సాధారణ ప్రసవం చేయడానికి ప్రయత్నించారని వారు ఆరోపిస్తున్నారు. తాము ఎంత వేడుకున్నా సాధారణ ప్రసవం వైపే వైద్యులు మొగ్గుచూపి కాన్పు చేశారని వారు పేర్కొన్నారు. ఆడపిల్ల పుట్టడంతో మహాలక్ష్మి పుట్టిందని సంబరపడేలోపు పుట్టిన శిశువులో




చలనం లేదని వారు రోదిస్తూ పేర్కొన్నారు. మృత శిశువు జన్మించిందని వైద్యులు చెప్పడంతో అర్ధరాత్రి వైద్యులతో వాగ్వాదానికి దిగారు. తాము చెప్పినట్లు ఆపరేషన్ చేస్తే బిడ్డ బతికేదని, వైద్యుల నిర్లక్ష్యం వల్లే తమ బిడ్డ కడుపులోనే శిశువు మృతి చెందిందని ఆరోపించారు. ఈ విషయమై ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను వివరణ కోరగా ప్రసవం సమయంలో వైద్యుల నిర్లక్ష్యం ఏమాత్రం లేదన్నారు. ఉమ్మనీరు మింగడంతోనే శిశువు మృతి చెందిందని స్పష్టం చేశారు.

## కరెంట్ షాక్‌తో మూడు గేదెలు మృతి

**అక్షరటుడే, లింగంపేట :** లింగంపేట మండలం భవానిపేట గ్రామ శివారులో కరెంట్ షాక్‌తో మూడు గేదెలు మృతి చెందినట్లు లైన్‌మన్ పాండు తెలిపారు. మాదిగ బాలయ్య పొలం వద్ద బోరు మోటార్‌కు సంబంధించిన సర్వీస్ వైరు తెగిపోయి ఫినిషింగ్ వైర్‌పై పడింది. ఆ వైరుకు విద్యుత్ సరఫరా కావడంతో ప్రమాదవశాత్తు దానికి తాకిన గేదేలు మృతి చెందాయి. ఆకుల సురేందర్ , గుండ్ర సత్యనారాయణ, గుండ్ర పరందాములు గేదెలు మృతి చెందినట్లు ఆయన తెలిపారు. రూ.3 లక్షల మేర నష్టం జరిగిందని బాధితులు వాపోయారు.

## కాపర్ కాయిల్స్, ఆయిల్ చోరీ

**అక్షరటుడే, ఆర్మూర్:** నందిపేట్ మండలం ఉమ్మెడ గ్రామ పరిధిలోని కొండూర్ – ఉమ్మెడ లిఫ్ట్ ఇరిగేషన్ స్టేజ్–2 పంప్ హౌస్‌లో శుక్రవారం దొంగలు చోరీకి పాల్పడ్డారు. అర్ధరాత్రి సమయంలో ఇద్దరు తెలియని వ్యక్తులు ఇనుపరాడ్లతో గదిలోకి ప్రవేశించి అక్కడ విధులు నిర్వహిస్తున్న ఆపరేటర్లను బెదిరించారు. 250 కేవీ ట్రాన్స్ ఫార్మర్‌ను పగులగొట్టి, కాపర్ కాయిల్స్, ఆయిల్‌ను దొంగిలించిన్నట్లు ఎస్సై శ్యాంరాజ్ తెలిపారు. ఈ సంఘటనలో సుమారు రూ.1,20,000 విలువ చేసే సొత్తు చోరీకి గురైనట్లు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.